క్లుప్తంగా

సీఎంను కలిసిన ఏపూరి



సీఎం రేవంత్ రెడ్డితో ఏపూరి సోమన్న

తిరుమలగిరి : అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించిన సందర్భంగా హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని ప్రముఖ గాయకుడు ఏపూరి సోమన్న కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు బిల్లులను ఆమోదించడం చారిత్రాత్మక నిర్ణయం అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు.

రోడ్లపై వ్యాపారాలు చేయొద్దు



వ్యాపారులతో మాట్లాడుతున్న అధికారులు

తిరుమలగిరి : రోడ్లపై వ్యాపారాలు చేస్తే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ యాదగిరి, ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని సూర్యాపేట – జనగామ జాతీయ రహదారి పక్కన ప్రతి బుధవారం జరిగే సంతను సిబ్బందితో కలిసి వారు సందర్శించారు. సంతలో చిరు వ్యాపారులతో మాట్లాడారు. మున్సిపాలిటీ వారు ఇచ్చిన స్థలాలలోనే వ్యాపారం చేసుకోవాలని సూచించారు. సంతరోజు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నికోలస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అవగాహన

నూతనకల్: నూతనకల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు బుధవారం ఓటరు జాబితాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడారు. ఓటర్ల చిరునామా మార్పు, కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు తదితర అంశాల గురించి సూచనలు చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం




డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని కోటపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అనుభవాలను, ఉపాధ్యాయులతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య, ఉపాధ్యాయులు పుల్లయ్య, అఙ్మతున్నీస, గురువయ్య, రమాకాంత్, సౌజన్య, శంకర్, ఎండీ ఫరూక్, సైదులు, రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి

పెన్‌పహాడ్: మానవ అక్రమ రవాణాను అరికడదామని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వెలుగు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బాలలు అక్రమ రవాణాకు గురవుతున్నట్లు గమనిస్తే 100, చైల్డ్‌లైన్ 1098, ఉమెన్స్ హెల్ప్ లైన్ 181 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చట్టాలు అమల్లో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అజయ్ నాయక్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ దాడుల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీఎం రమణాకర్

నూతనకల్ : మానవ అక్రమ రవాణా, సైబర్ దాడుల నివారణపై మహిళలకు మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం రమణాకర్ మాట్లాడారు. మానవ అక్రమ రవాణా, సైబర్ ఆధారిత రవాణా, లైంగిక వ్యాపారం, మొదలగు అంశాలపై మహిళలు రక్షణ పొందడానికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీసీలు ముత్తయ్య, సరస్వతి, గీత, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

ముందుకు సాగని ఇళ్ల పనులు

- నెలల తరబడి పునాది దశలోనే నమూనా ఇంటి నిర్మాణం
- దుబ్బతండాలో 18 ఇళ్లు మంజూరైనా పనులకు కలగని మోక్షం



మోడల్ పంచాయతీగా ఎంపికైన దుబ్బతండాలో ఇంటి నిర్మాణం కోసం పోసిన ముగ్గు



పెన్‌పహాడ్‌లో పిల్లర్ల దశలో ఉన్న నమూనా ఇంటి నిర్మాణ పనులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దుబ్బతండాను అధికారులు మోడల్ పంచాయతీగా ఎంపిక చేశారు. గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలను ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేశారు. కానీ పనులు ముందుకు సాగడం లేదు. ఇళ్లు మంజూరై రెండు నెలలు కావస్తున్నా నేటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. మండల కేంద్రంలో నమూనా ఇంటిని నిర్మించి దాని మాదిరిగా లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు చేపడతామని అధికారులు చెప్పినా.. పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది.

పిల్లర్ల దశలోనే..

పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణం చేయాలని అధికారులు ముగ్గు పోశారు. నెల రోజులకు పనుల్లో భాగంగా గోతులు తీసి వదిలేశారు. ఆ తర్వాత నెల రోజులు పూర్తి కావస్తున్నా నమూనా ఇంటి నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. నమూనా ఇంటి నిర్మాణ పనులే నత్తనడకన సాగుతుంటే మోడల్ పంచాయతీలో ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పుడు ప్రారంభిస్తారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

దుబ్బతండాలో 18 ఇళ్లు మంజూరు..

మండల పరిధిలోని దుబ్బతండా పంచాయతీని మోడల్ పంచాయతీగా ఎంపిక చేసి 18 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. గ్రామంలో నిబంధనల ప్రకారం ఇల్లు లేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. పూరిగుడిసె, రేకుల షెడ్లు ఉండి సొంత స్థలం ఉన్న వారికి రెండో ప్రాధాన్యత, మట్టి గోడలు, పెంకుటిల్లు ఉన్న వారిని గుర్తించి మూడో ప్రాధాన్యత ఇస్తూ వరుస క్రమంలో లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను మంజూరు చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షల సాయాన్ని నాలుగు విడతల్లో అందజేస్తామని అధికారులు చెప్పారు. కానీ ఇప్పటివరకు దుబ్బతండాలోని ఇళ్ల నిర్మాణాల్లో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని గ్రామ ప్రజలు చెబుతున్నారు.

పనులు చేపడతాం



దుబ్బతండా మోడల్ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. ప్రస్తుతం నాలుగు ఇళ్లకు గుంతలు తీశారు. రెండు ఇళ్లకు ముగ్గులు పోయించాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

ప్రొటీన్స్‌తో కూడిన ఆహారం తీసుకోవాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



రోగులకు గుడ్లు అందిస్తున్న కలెక్టర్

భానుపురి : టీబీ రోగులు ప్రొటీన్స్‌తో కూడిన ఆహారం తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఎంహెచ్‌ఓ కోటాచలంతో కలిసి టీబీ రోగులకు ఫుడ్ బాస్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీబీ రోగులు తప్పనిసరిగా 6 నెలల పాటు టాబ్లెట్స్ వాడాలన్నారు. టీబీ రోగుల్లో చాలా మంది పేదవారు ఉన్నారని, వారికి సహాయం చేసేందుకు ఫార్మసీ కంపెనీలు, ఇండస్ట్రీస్, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి నిక్షయ్ మిత్రగా ఉండాలని తెలిపారు. అనంతరం జువారి సిమెంట్ సహకారంతో మేళ్లచెరువు మండలానికి చెందిన 30 మందికి నెల రోజులకు సరిపోను కేజీ కందిపప్పు, అర కేజీ ఆయిల్, కేజీ పల్లీలు, 3 కేజీల బియ్యం, 30 గుడ్లతో కూడిన ఫుడ్ బాస్కెట్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మనోరమ, ప్రోగ్రాం అధికారిణి నాజియా, పల్మనాలజిస్ట్ వెంకట పాపిరెడ్డి, జువారి సిమెంట్ ప్రతినిధులు జీఎల్‌వీ రావు, పద్మ శ్రీ పాటిల్, తేజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రమేష్‌రెడ్డి

పెన్‌పహాడ్ : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు సువెన్‌ఫార్మా కంపెనీ సహకారంతో రూ.10లక్షల వ్యయంతో వాటర్‌ప్లాంట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వాటర్ ప్లాంట్‌కు యగ్గడి సత్తమయ్య–నీలమ్మ ఒక గుంట స్థలాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడవెల్లి అఖిల్ రెడ్డి, సువెన్ ఫార్మా కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌బాబు, మేనేజర్లు వెంకటరమణమూర్తి, సూదిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నారాయణ శ్రీధర్‌రెడ్డి, గుర్రం అమృతారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సైదులు, జీవన్ నాయక్, యాదగిరి, సలీం, సురేష్, సుందర్, షకీలా, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : విద్యారంగాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విస్మరించిందని, బడ్జెట్ కేటాయింపుల్లో మొక్కుబడిగా నిధులు కేటాయిస్తున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ అన్నారు. బుధవారం స్థానిక 60 ఫీట్ల రోడ్డులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా విద్యారంగంపై, విద్యార్థులపై సవతి తల్లి ప్రేమను చూపిస్తుందని విమర్శించారు. నాణ్యమైన ప్రమాణాలతో కూడిన విద్య తారతమ్య భేదాలు లేకుండా అందరికీ అందినప్పుడే దేశం ప్రగతి బాటలో నిలుస్తుందన్నారు. కానీ పాలకులకు విద్యారంగాన్ని బలోపేతం చేయాలనే చిత్తశుద్ధి లోపించిందని చెప్పారు. పాలకులు మారినా పరిపాలన విధానం మారడం లేదన్నారు. రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాలుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిస్థాయిలో విడుదల కాలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర, దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అక్కినపల్లి వినయ్, దీపక్, సంతోష్, అరుణ్, నాని, అజయ్, వేణు, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

తుంగతుర్తి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శేషుకుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో 2023 ఏప్రిల్ నుంచి మార్చి 2024 వరకు ఉపాధిహామీ పథకంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు రూపొందించిన తుది నివేదికను గురువారం సమర్పిస్తారని తెలిపారు. కూలీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మేట్లు, రైతులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నగదు బదిలీ అమలు చేయాలి

అర్వపల్లి : గొల్ల కురుమలకు, గొర్రెల యూనిట్లకు నగదు బదిలీని అమలు చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వజ్జె వినయ్‌యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రామన్నగూడెంలో గొర్రెల మంద వద్ద నిరసన తెలుపుతూ మాట్లాడారు. వృత్తిదారులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి 16నెలలు గడుస్తున్నా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. 50 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి కాపరికి ఆసరా ఫించన్, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ప్రతి సొసైటీకి 30ఎకరాల భూమిలో గడ్డి పెంచి ఇవ్వాలని కోరారు.

మంద కృష్ణకు మాదిగ జాతి రుణపడి ఉంటుంది



సూర్యాపేట : సంబరాలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఆత్మకూర్(ఎస్) : మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సూర్యాపేట : మంద కృష్ణకు మాదిగ జాతి రుణపడి ఉంటుందని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు మాదిగ అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం దగ్గర ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గుద్దేటి ఎల్లయ్య మాదిగ, చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ, ఎర్ర వీరస్వామి మాదిగ, బొజ్జ సైదులు మాదిగ, ముల్కలపల్లి రవిమాదిగ,వల్దాస్ జానీ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : మంద కృష్ణమాదిగ చేసిన పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముల్కలపల్లి రవిమాదిగ అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మండల కేంద్రంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదిగ, మాదిగ ఉప కులాలు ఎస్సీ రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. మండల అధ్యక్షుడు మేడి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తిప్పర్తి గంగరాజు, జగన్, లింగరాజు, వెంకటరమణ, మహేష్, లక్ష్మణ్, చిన్న, మధు, రాము, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం హర్షణీయం



తిరుమలగిరిలో మాట్లాడుతున్న నాయకులు

తిరుమలగిరి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టం అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు తెలిపారు. తిరుమలగిరిలో బుధవారం బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఏ పార్టీ చేయని విధంగా కులగణన సర్వే చేసి బీసీలు 46.25 శాతం ఉన్నారని తేల్చినట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు కూడా మద్దతు తెలపడం సంతోషకరమని అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు వంగరి బ్రహ్మం, చింతకింది మురళి, చింతకింది సోమనారాయణ, గూడూరు వెంకన్న, దుస్సా రామ్మూర్తి, పులిమామిడి భిక్షం, శీలం ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరాహార దీక్ష



నిరాహార దీక్షలో పాల్గొన్న నాయకులు

నూతనకల్ : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు మాట్లాడారు. ఎండుతున్న పంట పొలాలను కాపాడటం కోసం ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గోదావరి జలాలను పూర్తిస్థాయిలో విడుదల చేయాలన్నారు. ఎండిన పొలాలకు ఎకరాకు రూ. 25వేల నష్టపరిహారం అందించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు అందించాలని, మండల కేంద్రం నుంచి వెంకెపల్లి వరకు బీటీ రోడ్డు పునర్నిర్మించాలని అన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, బత్తుల జనార్దన్, తొట్ల లింగయ్య, కూసు సైదులు, బొజ్జ శ్రీను, గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, జటంగి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

అర్వపల్లి : అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ బిల్లును ఆమోదించడాన్ని హర్షిస్తూ అర్వపల్లిలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, బద్దం యాదగిరి, ఏఎంసీ డైరెక్టర్లు బైరబోయిన సైదులు, జలేందర్, బైరబోయిన మహరాజు, పాలెల్లి సురేష్, నల్లగుంట్ల శ్రీనివాస్, రవికుమార్, పి. శ్రీనివాస్, భిక్షం, రవీందర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదం చరిత్రాత్మకం

తుంగతుర్తి : ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణనలను రాష్ట్ర శాసన సభ ఆమోదించడం చరిత్రాత్మకమని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాలకృష్ణయాదవ్



హైదరాబాద్‌లో నియామకపత్రం అందుకుంటున్న బాలకృష్ణయాదవ్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన పొగాకు బాలకృష్ణయాదవ్ జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు వంశీయాదవ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అంజలియాదవ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు.

స్వరాజ్యం ఆశయసాధనకు కృషి చేయాలి



స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నూతనకల్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సీపీఎం సీనియర్ నాయకురాలు మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. బుధవారం స్వరాజ్యం 3వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, బొజ్జ శ్రీను, ఉప్పుల పరమేష్, భోనగిరి శ్రీకాంత్, గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, బొజ్జ శ్రీను, తొట్ల లింగయ్య, తిరుమలేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : మల్లు స్వరాజ్యం మూడవ వర్ధంతిని తిరుమలగిరిలోని చౌరస్తాలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ గుమ్మడవెల్లి ఉప్పలయ్య, మండల కమిటీ సభ్యులు కడెం లింగయ్య, చిత్తలూరి సోమయ్య, తిపిరాల సోమయ్య, సామాజిక తెలంగాణ నాయకులు కొత్త గట్టు మల్లయ్య పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : స్వాతంత్ర్య సమరయోధురాలు మల్లు స్వరాజ్యం పోరాటాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఆవిరి అప్పయ్య అన్నారు. మల్లు స్వరాజ్యం మూడవ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని ఏపూరులో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. భూస్వాములకు, పెత్తందారులకు, రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమించిన వీర వనిత స్వరాజ్యం అని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సానబోయిన ఉపేందర్, ఎరుకల నాగరాజు, నూకల గిరిప్రసాద్ రెడ్డి, వరికుప్పల మహేష్, నవిల రవి, లింగయ్య, సాయి,నవీల సుదర్శన్ పాల్గొన్నారు.

అర్వపల్లి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని అర్వపల్లిలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, ఎల్లంల అవిలయ్య, శిగ వెంకన్న, కొమ్ము విజయ్, అబ్బులు, శిగ రవి, బొడ్డు సైదులు, రాజయ్య, సైదయ్య, నరేందర్, కృష్ణయ్య, జానయ్య, నర్సయ్య, సైదులు, భద్రయ్య, వెంకన్న, సుధాకర్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మధుకర్‌రెడ్డి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం గ్రామం నుంచి మూసీ నది ఏటి ఒడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్ రెడ్డి చెప్పారు. జాజిరెడ్డిగూడెంలోని మూసీనది ఒడ్డున ఉన్న గంగదేవమ్మ ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఇటీవల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. అయితే ఎమ్మెల్యే స్పందించి రూ.25 లక్షలు మంజూరు చేయించారని అన్నారు. దీంతో పనులను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, ఏఎంసీ డైరెక్టర్ జలేంధర్, యాగయ్య, ఎఫ్‌సీఎస్ చైర్మన్ మామిడి విజయ్‌కుమార్, చింతల సురేష్, నిమ్మల నిరంజన్, సైదుల కిరణ్, చింతల సైదులు, ఎం.వెంకన్న పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

అర్వపల్లి : పదవ తరగతి వార్షిక ఫలితాలలో విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించాలని ఎంఈఓ బి.బాలునాయక్ కోరారు. జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌ఓ కుంభం ప్రభాకర్, ఇన్‌చార్జ్ హెచ్ఎం కేసీహెచ్ వెంకట్‌రెడ్డి, ఏపీసీ చైర్‌పర్సన్ కుంభం వెంకటరమణ, పీఎస్ హెచ్ఎం ఇందిర, ఉపాధ్యాయులు ఆర్.సైదులు, ఎస్.మల్లిక, జె.పురుషోత్తం, కె.సంపత్, నోముల వెంకటేశ్వర్లు, రజిని, రమేష్, ఫజల్‌ఖాన్, జ్ఞానేశ్వరి, సైదులు, చంద్రకళ, సిబ్బంది జలేంధర్, ప్రకాశం, రాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పెన్‌పహాడ్ : విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఎంఈఓ నకిరేకంటి రవి



నూతనకల్ : విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

పెన్‌పహాడ్ : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సమకూర్చిన పరీక్ష సామగ్రిని బుధవారం ఆయన విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు చక్కగా చదివి, ప్రశాంతమైన వాతావరణంలో పబ్లిక్ పరీక్షలు రాసి, ఉత్తీర్ణులు కావాలని కోరారు. పదో తరగతి విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, రాములు, ఉపేందర్, రఫీయా, మనోహర్ పాల్గొన్నారు.

నూతనకల్ : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాధించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సువెన్ ఫార్మా కంపెనీ ఆర్థిక సహకారంతో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని చదివినట్లయితే జీవితంలో ఉన్నత లక్ష్యాలకు చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాములు నాయక్, సువెన్‌ఫార్మా కంపెనీ ప్రతినిధులు పీఎస్‌మూర్తి, వెంకటరమణ, అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంరెడ్డి, సైదులు పాల్గొన్నారు.


తపాలా జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలి



లోయపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

అర్వపల్లి : గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట పోస్టల్ సూపరింటెండెంట్ వడ్లమూడి వెంకటేశ్వర్లు కోరారు. లోయపల్లి గ్రామంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, ఉపాధి కూలీలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ జరిపారు. జీవిత బీమా పాలసీలపై వివరించారు. ఈ కార్యక్రమంలో తపాలా జీవిత బీమా అభివృద్ధి అధికారి సైదులు, ఏజెంట్ ఆరె.ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.

‘చలో పార్లమెంట్’ను విజయవంతం చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

నూతనకల్ : రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న నిర్వహిస్తున్న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రాంబాబు కోరారు. బుధవారం మండల కేంద్రంలో చలో పార్లమెంట్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని అన్నారు. అర్హులైన కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. ప్రతి కార్మికుడికి ప్రమాద బీమా, థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పంతం వెంకన్న, ఇరుగు రమేష్, సైదులు, ప్రవీణ్, శ్రావణ్, నాగయ్య, రమేష్ పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



నిరసన తెలుపుతున్న న్యూడెమోక్రసీ నాయకులు

అర్వపల్లి : ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ డిమాండ్ చేశారు. జాజిరెడ్డిగూడెంతోపాటు వివిధ గ్రామాల్లో బుధవారం ఎండిపోయిన వరిపంటలను న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పరిశీలించారు. గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ నాయకుడు పోలెబోయిన లింగయ్య, గ్రామ కార్యదర్శి వడకాల బయ్యన్న, కొమరయ్య, నర్సయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.